

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరువీధుల్లో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం,నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): వాడపల్లి వెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాలనుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.54.05 లక్షలు లభించినట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భక్తులతో అంతర్వేది ఆలయం కిటకిట



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అంతర్వేది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగియడంతో పాడ్యమి దీపాలు వదిలిన భక్తులు శనివారం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పోటెత్తారు. పుణ్యక్షేత్ర ఆలయాలను దర్శించుకున్న భక్తులు ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. సాగర సంగమం, లైట్‌హౌస్, బీచ్, పర్యాటక ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు.

శనీశ్వరాలయానికి భక్తుల తాకిడి

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మందపల్లి మందేశ్వర శనీశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. స్వామిని కేరళ డీజీపీ ఆర్.ఆజాద్‌చంద్రశేఖర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేశారు. స్వామివారికి రూ.2,29,621 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. మందపల్లి పెద్దవంతెన ఆర్చి గేటువద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేసిన అమలాపురం డీఎం, డీపీటీవోలకు.. దీనికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారుకు దేవస్థానం తరఫున ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

20 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు



ఈతకోట టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సును తనిఖీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భద్రతా ప్రమాణాలు, రికార్డులు సక్రమంగా నిర్వహించని 20 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈతకోట జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు నిర్వహించారు. భద్రతా ప్రమాణాలు పాటించని 20బస్సులపై కేసులు నమోదు చేసి రూ.43,500 అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా ప్రమాణాల ఉల్లంఘనను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, అటువంటి బస్సులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బస్సు డ్రైవరు నిబంధనలు పాటిస్తూ వాహనం నడపాలని, లేదంటే లైసెన్స్ రద్దు చేసి సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఓలేటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, లక్ష్మీశ్రీదేవి, షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిక్కితే.. ఖాతా ఖాళీ!

- చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
- మళ్లీ చేతికి చేరడం అసాధ్యమే
- అప్రమత్తతే ఆయుధం



దొంగలున్నారు.. జాగ్రత్త!. ఇది పోలీసులు తరచు చేసే హెచ్చరిక. మీరు ఎక్కడికైనా వెళితే ఇంట్లోని బంగారం, డబ్బు సురక్షితంగా దాచుకొని వెళ్లాలని చెబుతారు. లేదంటే తమకు సమాచారం ఇస్తే మీ ఇంటికి రక్షణ కల్పిస్తామని కూడా ఈమధ్య హోరెత్తిస్తున్నారు. ఒకవేళ సొత్తు చోరీకి గురైనా పోలీసుల దర్యాప్తులో దొంగలు పట్టుబడటం, సొత్తు రికవరీ చేయడం కూడా మనకు తెలుసు. ఇప్పుడు దొంగలు పడుతున్నది ఇళ్లలో కాదు.. జేబు దొంగలూ కాదు.. మీ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లోనే ఓ కన్నేస్తారు. ఏదొక ఎత్తుగడతో మాయ చేసో, బెదిరించో బ్యాంకు అకౌంట్ల నుంచి మొత్తం దోచేస్తున్నారు. ఇందులో ధనవంతులే కాదు.. చిరుద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారు, పింఛను పొందుతున్న వృద్ధులు సైతం ఈ ఆన్‌లైన్ మోసంలో చిక్కి బలైపోతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సైబర్ క్రైం విషయంలో దొంగా పోలీస్ ఆటలో దొంగలదే పైచేయిగా నిలుస్తోంది. ఆధునిక సాంకేతికతను పోలీసులు అర్థంచేసుకొనేలోపుగా సైబర్ బూచోళ్లు ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఇప్పటివరకూ సైబర్ నేరాల్లో గంటలోపుగా ఫిర్యాదుచేస్తే డబ్బు వెనక్కి రప్పించే అవకాశాలు సగమన్నా ఉండేవి. ఇప్పుడు ఆ సమయం నిమిషాల్లోకి వచ్చేసింది. సొమ్ము ఒక్కసారి ఖాతా దాటితే దాదాపుగా బూడిదలో పోసిన పన్నీరేనని కేసులు రుజువు చేస్తున్నాయి. అధిక శాతం పోలీసులకు ఈ నేరాలపై అవగాహన లేదు. ఎఫ్ఐఆర్ ఎలా, ఏ సెక్షన్ల ప్రకారం నమోదుచేయాలో కూడా తెలియక తికమకపడుతున్నారు. బాధితుడు మోసపోయానని గుర్తించి తేరుకొనేలోపుగా ఆ డబ్బులు నాలుగైదు దశలు దాటిపోతోంది. కొన్నేళ్ల కిందట లాటరీల పేరుతో నైజీరియన్లు సైబర్ నేరాలకు తెరతీశారు. తర్వాత మార్పులు సంతరించుకుంటూ బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్‌డేట్, ప్రభుత్వ పథకాల పేరుతో, కొరియర్, కొద్ది పెట్టుబడితో భారీ రాబడి, యాప్‌లు ఇలా రకరకాల మోసాలు సాగుతూ డిజిటల్ అరెస్టుల వరకూ పరిస్థితి చేరింది. రోజుకో మోసపు ఆలోచనతో కోట్ల సొమ్మును సైబర్ బూచోళ్లు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వాలు, సాఫ్ట్‌వేర్లు, సర్వర్ల విషయంలో ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నా అవన్నీ బలాదూర్ అని నేరగాళ్లు నిరూపిస్తున్నారు.

● రికవరీ దైవాధీనం


ప్రస్తుతం సైబర్ క్రైంలో రికవరీ శాతం అతి స్వల్పం. రూ.10 కోట్లు పోగొట్టుకుంటే రూ.లక్ష కూడా వెనక్కి రప్పించలేని పరిస్థితి. దర్యాప్తు ఎంత ముమ్మరంగా, తెలివిగా చేసినా ఖాతా నుంచి మాయమైన డబ్బులు వెనక్కి రావడం లేదు. ఖాతా నుంచి డబ్బులు దొంగిలించారని బ్యాంకు వాళ్లకు చెబితే.. పోలీసులకు ఫిర్యాదు చేయండని ఉచిత సలహా పడేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరాలు రోజుకు 20 వరకూ జిల్లా కేంద్రాల్లోని సైబర్ సెల్‌లో రిపోర్టు అవుతున్నాయి. ఇక పోలీస్ స్టేషన్లకు వచ్చినవి, ఎవరికీ చెప్పలేక ఉండిపోయినవి ఇంకెన్నో.

ఏపీకే క్లిక్ చేస్తే.. ఖతం

ఆర్టీవో, ఎస్‌బీఐ, పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్‌తో బురిడీ

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం పట్టణానికి చెందిన సత్యప్రసాద్‌కు తెలిసిన మిత్రుడు వాట్సాప్ నుంచి సందేశం వచ్చింది. మీకు పీఎం కిసాన్ పడిందా లేదా చూసుకోండి అంటూ ఏపీకే ఫైల్‌ను అతను పంపినట్టు పంపారు. దాన్ని క్లిక్ చేశాడు. ఫోన్ హేక్ అయింది. ఉన్న రెండు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ కావడంతోపాటు ఇదే రీతిలో అతని పేరుతో కాంటాక్టు లిస్ట్‌లో ఉన్నవారందరికి మెసేజీలు వెళ్లాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన నరసింహరావుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వాట్సాప్ మెసేజీ వచ్చింది. మీ ఎస్‌బీఐ రివార్డ్స్ అప్‌డేట్ చేసుకోండి అని అంతే క్లిక్ చేశాడు. అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.6,500 డెబిట్ అయినట్టు మెసేజీ వచ్చింది. ఇలా రకరకాల ఏపీకే ఫైల్స్ తెలుసున్న వ్యక్తులు, స్నేహితులు, బంధువుల దగ్గర నుంచి వచ్చినట్టు వాట్సాప్‌లు ద్వారా వ్యక్తిగతంగా, గ్రూప్‌ల్లో వస్తున్నాయి. ఏపీకే ఫైల్ ఓపెన్ చేయగానే ఫోన్ హేక్ చేసి డిస్‌ప్లే పేరును స్టేట్‌బ్యాంకు లేదా ప్రభుత్వ సంస్థలుగా మార్చివేసి ఆ పేరుతోనే మెసేజీలు పంపుతున్నాయి. తెలియక కొందరు క్లిక్ చేసి మోసపోవడం జరుగుతోంది. మోసపోయిన వారిలో డెబిట్ అయిన సొమ్ములు తక్కువ కావడంతో కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.



● డిజిటల్ అరెస్టు.. రూ.34 లక్షలకు టోపీ

ముమ్మిడివరానికి చెందిన విశ్రాంతి మండల విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీకి ఈనెల 8న టెలిఫోన్ డిపార్టుమెంట్ పేరిట ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మీ నంబరుపై బెంగళూరులో ఒక సీరియస్ కేసు నమోదై ఉందని, మహారాష్ట్ర కెనారా బ్యాంకులో ఏటీఎం నేరం ఉందని, రూ.3 కోట్ల కుంభకోణంలో రూ.75 లక్షలు మీకు ముట్టిందని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించారు. విశ్రాంత ఎంఈవోను బెదిరించి ఆయన అకౌంట్‌లోని రూ.15 లక్షలు లాగేశారు. తర్వాత పీఎఫ్ లోన్ తీసుకోమని వారే చెప్పి 12న రూ.9 లక్షల 80 వేలు, 15న రూ.9 లక్షల 80వేలు మొత్తం మూడు దఫాలుగా రూ.34లక్షల 60వేలు ఆర్టీజీఎస్ చేయించుకుని టోపీ పెట్టారు. ఆ సొమ్ములు తిరిగి తన ఖాతాకు జమకాకపోవడంతో వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల మోసానికి గురైనట్టు గుర్తించి ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించారు.

● రూ.74 లక్షలు కొట్టేశారిలా..

రాజానగరం మండలం కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్. ఆగస్టు 17న స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికారు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా ఓపెన్ చేయగా, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్‌చేయాలని మెసేజ్ వచ్చింది. తర్వాత దఫదఫాలుగా 11సార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

● రికవరీ చేశారు..

రాజమహేంద్రవరంలో కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. కస్టమర్‌కేర్ నంబరుకోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఓ నకిలీ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా ఓటీపీని చెప్పడంతో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సొమ్మును ఫ్రీజ్‌చేసి పదిరోజుల్లో వెనక్కి రప్పించారు.

● తక్షణం ఏమి చేయాలి..

సైబర్ నేరం జరిగి ఖాతాలో డబ్బులు పోతే వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి అకౌంట్ ఫ్రీజ్ చేయించాలి. సైబర్‌క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేయడంతోపాటు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదుచేయాలి. మీ పరిధి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యా దుచేయాలి. గతంలో గంటలోపు టోల్‌ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేస్తే డబ్బులు విత్‌డ్రా కాకుండా బ్యాంకు ఫ్రీజ్ చేసేది. ఇప్పుడు నిమిషాల్లోనే నేరగాళ్ల క్రిప్టో కరెన్సీలోనికి మళ్లించేస్తున్నారు.

డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు

శివకోడులో స్థలాల పరిశీలన

- ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అభిమానులు సహకరించాలి: కలెక్టర్
- పర్యటనను విజయవంతం చేయాలి: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



శివకోడులో పల్లెపండుగ 2.0 కార్యక్రమ స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం మండలాల్లో ఈనెల26న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారు. మలికిపురం మండలంలోని పలు గ్రామాల్లో చనిపోయిన కొబ్బరిచెట్ల పరిశీలనతోపాటు రాజోలు మండలం శివకోడులో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న లేఅవుట్‌లో రాష్ట్రస్థాయి పల్లెపండుగ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శివకోడులో హైవే పక్కనున్న బళ్ల రత్నరాజు లేఅవుట్‌లో హెలిప్యాడ్ ఏర్పాటుకు, సభ నిర్వహణకు వీలుగా ఉండే స్థలాలను కలెక్టర్ మహేష్‌కుమార్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఎస్పీ రాహుల్‌మీనా కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేశారు.

పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

స్థలపరిశీలన తర్వాత శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో పర్యటన ఏర్పాట్లపై వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన రాజోలు నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం భద్రతా చర్యలను బలోపేతం చేయాలని సూచించారు.డిప్యూటీ సీఎం పర్యటనకు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అభిమానులు పూర్తిగా సహకరించాలని కోరారు. డిప్యూటీ సీఎం హోదాలో పవన్‌కల్యాణ్ తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వస్తున్నందున అభిమానులు సంయమనం పాటిస్తూ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రస్థాయి పల్లెపండుగ 2.0 కార్యక్రమం జరుగుతున్నందున శివకోడు సభా ప్రాంగణం వద్ద 10 వేల మంది పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమాలు సజావుగా నిర్వహించేలా సభాస్థలి వద్ద అన్నిఏర్పాట్లు చేయాలన్నారు.రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజోలు నియోజకవర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా ప్రతిఒక్కరూ పరస్పర సహకారంతో పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ నిర్దేశించిన విధులు, బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు శాంతి, భద్రతల పరిరక్షణ అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ మురళీమోహన్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మాస్టారూ.. మీరు సూపర్!!



విద్యార్థులతో మమేకమై బోధన చేస్తున్న వెంకటేశ్వరరావు

- నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శం చింతలూరు ఉపాధ్యాయుడు
- తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే కుమార్తెను చదివిస్తూ..
- విద్యార్థులకు అర్థమయ్యేలా.. నూతన ఒరవడితో బోధన
- ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావుకు 'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ ప్రశంస

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'పిల్లలకు క్షేత్ర పర్యటనలు, ప్రయోగాల ద్వారా బోధిస్తున్న తీరు ఆకట్టుకునేలా ఉంది. మీ పాప వుడతా వైష్ణవిని ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తూ ప్రజలకు ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచిన మీకు అభినందనలు' ఇది రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో ఒక ఉపాధ్యాయుడిని ప్రశంసిస్తూ చేసిన పోస్టింగ్. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వుడతా వెంకటేశ్వరరావు చిన్నారులకు వినూత్న పద్ధతుల్లో పాఠాలు చెప్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ పెట్టిన పోస్టింగ్‌తో ఆయన్ను పలువురు అభినందిస్తున్నారు.

కిచెన్ గార్డెన్.. న్యూట్రీగార్డెన్

సాక్షాత్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి 'మాస్టారూ.. మీరు బోధించే విధానాలు చాలా బాగున్నాయి.. అభినందనలు' అని ప్రశంసిస్తే.. ఆయన ఎంత అద్భుతంగా పాఠాలు చెప్తుంటే ఇలాంటి ప్రశంస అందుతుంది. అటువంటి అరుదైన గౌరవం చింతలూరు వుడతా వెంకటేశ్వరరావు మాస్టారుకు దక్కింది.ఈయన చిన్నారులతో మమేకమై.. పాఠాలు చెప్పే వీడియోలు కొన్ని సామాజిక మాధ్యమాల ద్వారా కొన్నాళ్లుగా వైరల్ అవుతున్నాయి. ఇవి మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లడం.. వాటిలో ఒకదాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ మాస్టారు విద్య అనే కాదు బడి ఆవరణలో కిచెన్ గార్డెన్‌తో పండించిన కూరగాయలు.. న్యూట్రీగార్డెన్ ద్వారా పండ్లు పండిస్తూ సేంద్రియ వ్యవసాయం, పోషకాహారం, పర్యావరణం గురించి బోధిస్తున్న తీరు స్ఫూర్తివంతంగా నిలుస్తుందని.. చైతన్యం నింపే వీడియోలు బాగున్నాయని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

ప్రశంసలు.. పురస్కారాలు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారని సమాజంలో ఒక విమర్శ ఉంది. ఇందుకు అతీతంగా ఈ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న వుడతా వెంకటేశ్వరరావు తన కుమార్తెను సైతం ఈ పాఠశాలలోనే చదివిస్తుండడం విశేషం. ఈ విషయాలను తెలుసుకున్న సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తన అధ్వర్యంలో ఆగస్టు 30న విజయవాడలో జరిగిన సోషల్ మీడియా డిజిటల్ కంటెంట్, యాక్టివిటీ వర్క్‌షాపు, రివ్యూ మీటింగ్‌కి ఆయన్ను ఆహ్వానించి ప్రతిభా పురస్కారం అందించారు. ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం స్వీకరించారు.



ఆహ్లాదంగా, ఆలోచింపజేసేలా..

చింతలూరులో పనిచేస్తున్న వెంకటేశ్వరరావు రోజువారీ పాఠశాలను సైతం వినూత్నంగా బోధిస్తారు. వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుంటారు. ఈయన విద్యార్థులకు అందించే బోధన ఆహ్లాదంగా, ఆలోచింపచేసేలా ఉంటుంది. విద్యార్థులతో అభినయింప చేస్తూ పాఠాలు నేర్పించడం, మిగతా విద్యార్థులు అభినయిస్తూ ప్రదర్శించే స్కిట్స్ పాఠశాలలో ప్రతి రోజూ బోధనలో ఉండే ప్రత్యేకతలు. దీనితో విద్యార్థులు నేర్చుకోవడానికి ఆసక్తి ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ పాఠశాల విద్యార్థుల వీడియోలకు సోషల్ మీడియాలో విస్తృతంగా లైక్‌లు, షేర్లు వస్తుంటాయి. వీడియోల రూపకల్పన, పాఠ్యపుస్తకాల్లోని విషయాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా క్రమపద్ధతిలో బోధించడం ఈయన ప్రత్యేకత.

ఈ ఏడాది సాఫీగా దర్శనం



గతేడాది ఆఖరు కార్తీక సోమవారం దక్షిణ గోపురం వద్ద భక్తుల రద్దీ



ఈ ఏడాది ఆఖరి కార్తీక సోమవారం దక్షిణగోపురం వద్ద పరిస్థితి

- ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో తూర్పురాజగోపుర ప్రవేశంతో పెనుమార్పు
- కార్తీక మాసం చివరి సోమవారం కనిపించని రద్దీ

ద్రాక్షారామ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీకమాసం నెలరోజులు భక్తులకు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి దర్శనం సాఫీగా సాగింది. ప్రతి సోమవారం వేలాదిమంది భక్తులు తరలివచ్చినా ఆలయంలో పెద్దగా రద్దీ అనేది కనిపించలేదు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గా భవానీ క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేయడం, తూర్పురాజగోపుర ప్రవేశం ద్వారా చేపట్టిన క్యూలైన్ల మార్పులే దీనికి కారణం.

గతమిదీ..

భీమేశ్వరస్వామి ఆలయానికి కార్తీకమాసం సోమవారాలు, మహాశివరాత్రి పర్వదినం రోజున వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. విపరీతమైన రద్దీ ఉంటుంది. గతంలో దక్షిణ గోపురం ద్వారా ఉచిత, ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించేవారు. ప్రత్యేక దర్శనం భక్తులు ప్రధాన ఆలయ మెట్లమీదుగా పైఅంతస్తుకు చేరుకుని స్వామిని దర్శించుకునేవారు. ఉచిత దర్శనం భక్తులు బేడామండపం మెట్లమీదుగా పైకి చేరుకుంటారు. ఇనుపబ్రిడ్జి మీదుగా స్వామిని దర్శించుకునేవారు. బయటకు భక్తులు అందరూ ఒకేమార్గం నుంచి వచ్చేవారు. దీంతో విపరీతమైన రద్దీ ఉండేది.

తూర్పురాజగోపుర ప్రవేశం ద్వారా..

ప్రస్తుతం ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ కార్తీక మాసం ముందు చేపట్టిన క్రౌడ్ మేనేజ్‌మెంటు ద్వారా పెనుమార్పులు జరిగాయి. తూర్పురాజగోపుర ప్రవేశం కల్పించడం ద్వారా మంచి ఫలితాలు సాధించారు. ఉచిత దర్శనం క్యూలైన్ సప్తగోదావరి నదిఒడ్డున ఆలయ బాహ్యప్రాకారం వెంబడి తూర్పు రాజగోపురం ద్వారా ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పలు మలుపులతో క్యూలైను ఏర్పాటు చేసి రద్దీ నియంత్రణ చేశారు. ధ్వజస్తంభం వద్ద ఇనుపమెట్ల ద్వారా బేడామండపం నుంచి స్వామిదర్శనం కల్పించారు. దక్షిణగోపురం ద్వారా ప్రత్యేక, శీఘ్రదర్శనం, వీఐపీ లైన్లు ఏర్పాటు చేశారు. దీంతో దక్షిణగోపురం వద్ద రద్దీ లేకుండా పోయింది. ఉచితం, ప్రత్యేక, శీఘ్రదర్శనం లైన్లు పూర్తిగా వేరు చేయడం ద్వారా స్వామి దర్శనానికి మూడు మార్గాలో భక్తులు స్వామి దర్శనం చేసుకుని వాటి ద్వారానే బయటకు వస్తున్నారు. దీంతో ఆలయంలో రద్దీ కనిపించడం లేదు. అమ్మవారి దర్శనంలో కూడా మార్పులు చేపట్టారు. స్వామి దర్శనానికి ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కిటికీలనే ద్వారాలుగా మార్చి..

ఆలయ ఈవోగా కేఎన్‌వీడీవీ ప్రసాద్ పనిచేసిన కాలంలో స్వామి దర్శనానికి పలు చర్యలు చేపట్టారు. కేంద్ర పురావస్తుశాఖ అనుమతులు తీసుకుని ప్రధాన ఆలయం పైఅంతస్తులో వెనుక, దక్షిణం వైపుపై ఉన్న కిటికీలను ద్వారాలుగా మార్చారు. ఇనుపమెట్లు ఏర్పాటు చేసి ప్రధాన ఆలయంలో ప్రవేశానికి మూడో మార్గం, బయటకు వెళ్లేందుకు రెండోమార్గం ఏర్పాటు చేశారు. దీంతో కొంత మేర రద్దీ నియంత్రణ జరిగింది. ఉచిత దర్శనం క్యూలైన్లు ఆలయ బాహ్య ప్రాంగణం నుంచి ధ్వజస్తంభం వద్ద పైఅంతస్థుకు ఇనుపమెట్లు ఏర్పాటు చేసి బేడామండపం ద్వారా స్వామిదర్శనం అయ్యేలా మార్పులు చేశారు. అయినా దక్షిణ గోపురం వద్ద రద్దీ ఉండేది.

మన్యంలో ముందస్తు జాగ్రత్తలు

మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై నిరసన నేపథ్యంలో పోలీసుల భారీ భద్రతా ఏర్పాట్లు

రంపచోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందిన ఘటనలకు నిరసనగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు, పలు ప్రజాసంఘాలు ఆదివారం ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రంప మన్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆదివారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలను, మాజీ ఎంపీలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించి నివాసాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ఆయా పోలీసుస్టేషన్లకు కూడా భద్రతను పెంచారు. ఇదిలాఉండగా ఆర్టీసీ ముందు జాగ్రత్తగా మన్యానికి వచ్చే కొన్ని సర్వీసులను రద్దుపర్చింది. మారేడుమిల్లి ఎగువ ప్రాంతానికి, చింతూరు ఘాట్ రోడ్లపైకి వాహనాలను నిరోధించే యోచనలో కూడా పోలీసులు ఉన్నారు. ఇక టూరిస్టులు కూడా రాకపోవడం మంచిదన్న సూచనలు కూడా వస్తున్నాయి.

చింతూరు మీదుగా రాకపోకల బంద్



చింతూరు- భద్రాచలం నడుమ హైవేపై చింతూరు పోలీసుల బందోబస్తు

చింతూరు, నవబంరు 22 (ఆంధ్రజ్యోతి): హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన పాటించాల్సిందిగా మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదలైన విషయం విధితమే. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుంచే చింతూరు మీదుగా సాగే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అత్యవస పరిస్థితి క్రమంలో వయా కూనవరం మీదుగా రాకపోకలకు అనుమతి ఇస్తున్నారు. మన్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఆ మేరకు కూంబింగులు చేస్తున్నారు.

జ్యోత్స్న అకాల మృతి బాధాకరం

తునిలో ఉపాధ్యాయురాలి కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత



తునిలో జ్యోత్స్న కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అనిత

తుని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అకాల మృతి బాధాకరమని, ఉపాధ్యాయురాలు పిల్లలకు వచ్చిన కష్టం తలుచుకుంటే చాలా బాధగా ఉందని హోం మంత్రి అనిత భావోద్వేగానికి గురయ్యారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరంలోని జడ్పీ హైస్కూల్లో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం జరిగి తునికి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్న మృతిచెందడంతో శనివారం తుని బ్యాంక్ కాలనీలో ఆమె పార్థివదేహానికి హోం మంత్రి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జ్యోత్స్న ఇద్దరి పిల్లలను చూసి చలించిపోయారు. వారిని దగ్గరకు తీసుకుని చదువుకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పిల్లల చదువు, ఉద్యోగానికి సంబంధించిన కొన్ని వెలుసుబాటును కుటుంబ సభ్యులు హోంమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారని, ఉపాధ్యాయురాలు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హోం మంత్రి తెలిపారు. ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సకాలంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయురాలి పెద్ద అబ్బాయి ప్రస్తుత ఉద్యోగ అర్హత వయస్సు రాకపోవడంతో రెండేళ్ల తరువాత ఉద్యోగం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. యనమల రాజేష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్ ఉన్నారు.

గోదావరి మధ్యలో మత్స్యకారుల పూజలు

పాలు పొంగించి భైరవస్వామికి నైవేద్యం సమర్పణ



నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న మత్స్యకారులు

యానాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాంలో గోదావరి మధ్యలో (ఐలాండ్) మత్స్యకారులు పూజలు నిర్వహించారు. యానాంలోని కొత్తపేట, అగ్రహారం, ఫ్రాన్స్‌తిప్ప గ్రామల మత్స్యకారులు ప్రతీ సంవత్సరం గోదావరి నీరు తగ్గిన తర్వాత వేటకు బయలుదేరే ముందు గోదావరి మధ్యలో ఉన్న ఐలాండ్‌లో భైరవస్వామికి పాలు పొంగించి నైవేద్యం సమర్పించే పవిత్ర సంప్రదాయాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నావలో ఐలాండ్‌కు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మత్స్యకారులందరూ పాలు పొంగించిన నైవేద్యాన్ని భైరవస్వామి) సమర్పించారు. మత్స్యకార ప్రతినిధి మల్లాడి శామ్యూల్, గ్రామ పెద్దలు ఉన్నారు.



నావలో వెళ్తున్న మల్లాడి కృష్ణారావు

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజల అనంతరం తూర్పురాజగోపురం వద్ద కు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

పెదపట్నంలంకలో ‘రాజీ.. నో కాంప్రమైజ్’

సినిమా షూటింగ్ ప్రారంభం

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెదపట్నంలంకలో రాజీ... నో కాంప్రమైజ్ అనే సినిమా షూటింగ్ శనివారం ప్రారంభించారు. వినాయకుడికి పూజలు నిర్వహించిన అనంతరం దర్శకుడు గెద్దాడ ప్రసాద్ చిత్రీకరణను ప్రారంభించారు. రాజీ... మంచి మొగుడు కావాలని దేవుడికి దణ్ణం పెట్టుకో అమ్మా అంటూ కథానాయిక జయశ్రీకి తండ్రి పాత్రధారి రాజీవ్ కనకాల చెప్పిన సీన్‌తో షూటింగ్ ప్రారంభమైంది. కుటుంబ కథా చిత్రంగా సాగే ఈ చిత్రాన్ని 4రోజులు పెదపట్నంలంకలో చిత్రీకరిస్తామని దర్శకుడు తెలిపారు. పల్లెటూరు వాతావరణంలో సాగే ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. షూటింగ్‌ను తిలకించడానికి స్థానికులు ఆసక్తి కనబరిచారు.





పెదపట్నంలంకలో రాజీవ్ కనకాల, హీరోయిన్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశాలు

జైల్లో పరిచయం.. నిత్యం దొంగతనాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

- నల్లజర్లలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- నల్లజర్ల, ప్రతిపాడు, తణుకులో చోరీలు చేసినట్టు గుర్తింపు
- ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు
- రూ.3 లక్షల నగదు, బంగారం, రెండు బైక్‌ల స్వాధీనం

నల్లజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో పలు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆరుగురు దొంగలను ప్రవేశపెట్టారు. వారి నుంచి రూ.3 లక్షల నగదు, బంగారం చైన్, 2 గాజులు, కారు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

నెల్లూరుకు చెందిన షేక్‌ఫక్రుద్దీన్ ఒంగోలు జైలులో ఉన్నప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కేసు ఉమ్రా మోహదా (హోలిటిడా పంచాయతీ, గంధవాన్ మండలం, ధార్ జిల్లా) రాగస్ మధవ్ హటిలా, బారిక్‌సింగ్ అజీనార్, ముహరు కల్లు మహదా, హీరు హరియా అజీనార్‌తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత ఏపీలో సంపన్నులు ఉంటారని, చోరీలు చేద్దామనుకుని నిర్ణయించుకున్నారు. దీంతో సెప్టెంబరు 24వ తేదీ అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో ఒంటరిగా నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంటి తలుపులు పగుల గొట్టి ఆమె మెడలోని బంగారు అభరణాలను దోచుకుపోయారు. అంతకుముందు కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని సురేష్ జ్యూయలరీ షాపులో 11 కిలోల వెండి, బైక్ దొంగతనం చేశారు. తర్వాత నల్లజర్లకు 2బైక్‌లు, కారుతో వచ్చి ఇక్కడ కూడా చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి మధ్యప్రదేశ్‌కు రైలులో పారి పోయారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, దేవరపల్లి సీఐ నాయక్ ఆధ్వర్యంలో 2బృందాలు మధ్యప్రదేశ్ వెళ్లి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఫక్రుద్దీన్ కదలికలపై నిఘాపెట్టారు. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం నల్లజర్లలో పోతవరం కుడి కాల్వ గట్టుపై అనుమానాస్పదంగా కొంతమంది తిరుగుతున్నట్టు నల్లజర్ల సీఐ రాంబాబుకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. విచారణ అనంతరం అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించుకుని వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేశారు. కష్టపడి పనిచేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. వీరిని దార్ ముఠాగా పిలుస్తారని, మధ్యప్రదేశ్‌లోని 4 గ్రామాల్లో కలిసి ఉంటూ నిత్యం దొంగతనాలు చేయడం, పోలీసులు వెళితే వారిపై దాడులకు పాల్పడడం, అవసరమైతే చంపేయడం వంటివి చేస్తారని డీఎస్పీ పేర్కొన్నారు. వీరు గతంలో పోలీసు అధికారులపై ఫైర్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. తణుకులో కూడా చోరీ చేసినట్టు గుర్తించారు. ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సీఐలు నాయక్, రాంబాబు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరంలో తప్పిన ప్రమాదం

దేవస్థానం బస్సును ఢీకొన్న బొలేరో వాహనం

గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న భక్తులు

అన్నవరం. నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి కొండపైకి తీసుకెళ్తున్న దేవస్థానం బస్సులో భక్తులకు ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం 10గంటల సమయంలో అన్నవర దేవస్థానం బస్సు భక్తులను రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వద్ద నిలపగా వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో బస్సు కుదుపునకు గురవడంతో భక్తులు భయబ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గండిపోశమ్మ దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వెలసిన స్వయంభూ గండి పోశమ్మ అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, ఆలయ పరిసరాలు బురదతో నిండి ఉన్నాయన్నారు. దీని దృష్ట్యా దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశామని దర్శనాలకు అనుమతించే తేదీ ప్రకటించే వరకు భక్తులు ఆలయ పరిసరాలకు రావద్దన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

మండపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కేపీరోడ్డులో శనివారం కారు ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కడియం మండలం మురమండకు చెందిన పి.కాంతమ్మ(70) మండపేట కేపీరోడ్డులో యాచక వృత్తి చేసుకుంటూ జీవిస్తుంది. శనివారం ఆమెను మారేడుబాక నుంచి వాడపల్లికి వెళ్తున్న కారు ఢీకొనగా తీవ్రగాయాలపాలై మృతిచెందింది. ఘటనపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.



వృద్ధురాలి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కోపంతో మామను తోసేసిన అల్లుడు

కొద్దిగంటలకే మృతి

కేసు నమోదు



మృతిచెందిన అప్పలరాజు

ధవళేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు గొడవ పడుతుండగా మధ్యలో ఆపడానికి వచ్చిన మామను అల్లుడు తోసివేయడంతో రోడ్డుపై పడిన మామ కొద్ది గంటల తరువాత మృతిచెందాడు. ఈ మేరకు అతడి కుమార్తె సప్పిడి ధన నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లుడి సప్పిడి నివాస్‌ను ధవళేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన ధన నాగమణిని సప్పిడి శ్రీనివాస్ 5 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కాపురం పెట్టాడు. కొద్దికాలం తరువాత భార్యపై అనుమానంతో కొట్టడం, తిట్టడం చేస్తుండటంతో నాగమణి భర్తను వీడి ధవళేశ్వరంలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. ఆపై భర్త రమ్మనడంతో మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయింది. మళ్లీ భార్యభర్తలు హైదరాబాద్‌లో గొడవపడి ధవళేశ్వరం చేరుకున్నారు. ఈ క్రమంలో నివాస్ శుక్రవారం రాత్రి మళ్లీ గొడవకు దిగడంతో అడ్డు వెళ్లిన మామ బక అప్పలరాజు (58)ను కోపంతో తోసివేశాడు. దీంతో రోడ్డుపై పడిపోయాడు. పైకి ఎటువంటి గాయం కనిపించకపోవడంతో ఇంటిలోకి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి అప్పలరాజుకు వెక్కిళ్లు రావడంతో కుమార్తె మంచినీళ్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తుండగా మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నివాస్‌పై ఐ498ఏ సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజోలు స్కౌట్ మాస్టర్‌కు ‘జాతీయ జంబోరి’ ఆహ్వానం



గోపాలకృష్ణ

రాజోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్నోలో ఈ నెల 23 నుంచి 29 వరకు జరిగే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 19 వ జాతీయ జంబోరి 75 సంవత్సరాల డైమండ్ జూబ్లీ వేడు కలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన విశ్రాంత ఎంఈవో, స్కౌట్ మాస్టర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణకు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా ఆయన విలే కర్లతో మాట్లాడుతూ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు తనతో పాటు తాటిపాక హైస్కూలు స్కౌట్ మాస్టర్ యెరుబండి నాగేశ్వరరావుకు ఆహ్వానం లభించిందని తెలిపారు. లక్నోలో జంబోరీకి వెళ్లిన జొన్నలగడ్డ, యెరుబండిని స్కౌట్స్ అండ్ గైడెడ్ కోఆర్డినేటర్ కె.కృష్ణప్రసాద్, ఏఎంవో రాంబాబు,దుర్గామాధవి పలువురు అభినందించారు.

అయినవిల్లిలో కేరళ డీజీపీ పూజలు

అయినవిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ డీజీపీ రావడ ఆజాద్‌చంద్రశేఖర్ శనివారం కుటుంబ సమేతంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను డీజీపీకి అందజేశారు.



కేరళ డీజీపీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

కాకినాడలో అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

13 జిల్లాల నుంచి 130మంది హాజరు



ఖోఖో ఆడుతున్న తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల క్రీడాకారులు





పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

కార్పొరేషన్ (కాకినాడ సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలకు క్రీడామైదానం ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఈ విషయంపై అసెంబ్లీలో చర్చిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య అండర్ 14, 17 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అం తర్ జిల్లాల ఖోఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ, డీఎస్‌డివో బి.సతీషకుమార్, ఖోఖో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామయ్య, జిల్లా ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభిరాం, టీడీపీ నాయకులు బి.కృష్ణమోహన్, ఎన్.గోవిందు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు క్రీడా రిజర్వేషన్‌ను 3శాతానికి పెంచారన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవిలో కాకినాడ బీచ్‌లో జాతీయ స్థాయి పోటీల నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని పీడీలను కోరారు. డీఎస్ఏ ఖోఖో కోర్టుల్లో ఫ్లడ్‌లైట్లు సౌకర్యం కల్పించాలని ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీను ఎమ్మెల్యే నానాజీని కోరగా పంతం ఫౌండేషన్ నుంచి ఫ్లడ్ లైట్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసి న క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అడ్మిన్ సెక్రటరీ సుధారాణి, సంఘ ప్రతినిధులు వాసు, స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ లంకా జార్జి, మాచరరావు, రాజశేఖర్, నూకరాజు, సురేష్‌రాజు, దిశ ఛైర్మన్ స్వరాజ్యలక్ష్మి, జేఎన్‌టియూకే పీడీ శ్యాంకుమార్ పాల్గొన్నారు.

జూడో పోటీలు...

తూర్పుగోదావరి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని ఇండోర్ హాల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. గౌరవ అతిథులుగా జూడో సంఘ ఛైర్మన్ వెలగ వెంకట కృష్ణారావు, రాష్ట్ర ఖోఖో సంఘ సీఈవో వెంకట నాగశెట్టి, రాష్ట్ర కార్యదర్శి పవన్ సందీప్, డీఎస్‌వో సతీష్‌కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా జూడో సంఘ కార్యదర్శి టీవీవీ రమణ అధ్యక్షత వహించారు. వెంకట కృష్ణారావు మాట్లాడుతూ జూడో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు 2రోజులు భోజన సదుపాయం కల్పిస్తున్నారన్నారు. బాలుర, బాలికల విభాగంలో చెరో ఏడు వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. డీఎ స్ఏ జూడో కోచ్ తేజ, వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



క్రీడాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటీఎంకు నిప్పు పెట్టాడు!

రెండు ఏసీలు దగ్ధం

పిఠాపురంలో అగంతకుడి దుశ్చర్య



ఏటీఎంలో కాలిపోయిన పరికరాలు, పేపర్లు

పిఠాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఒక అగంతకుడు ఏటీఎంకు నిప్పు పెట్టాడు. 2ఏసీలు, ఏటీఎం కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3.30-4గంటల మధ్య జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కాకినాడ జిల్లా పిఠాపురం మెయిన్ రోడ్డులో గల చర్చి సెంటర్ సమీపంలో సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ వద్దే ఏటీఎం ఉంది. శనివారం తెల్లవారుజామున అగంతకుడు ఏటీఎంకి వచ్చాడు. బయట నుంచి కాగితాలు తెచ్చి ఏటీఎం వద్ద వేసి నిప్పు పెట్టాడు. దీంతో ఏటీఎంతో పాటు అదే ఆవరణలో ఉన్న రెండు ఏసీలు కాలిపోయాయి. విషయాన్ని గమనించిన స్థానికులు, ఫైర్ అలర్ట్‌తో బ్యాంకు ఉన్నతాధికారులు పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్యాస్ సహాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏసీలతో పాటు ఏటీఎం పాక్షికంగా, లోపల ఉన్న ఇతర పేపర్లు కాలిపోయాయి. నగదు కూడా కాలిపోయిందని సమాచారం. కాగా ఘటనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి మతిస్థిమితం లేదని పోలీసులు చెప్తున్నారు. అయితే ఏటీఎంకు నిప్పు పెట్టే సమయంలో పట్టణంలోని ఇతర ఏటీఎంలను ఇదేవిధంగా కాల్చివేస్తానని ఆ ఆగంతకుడు చెప్పినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. సంఘటనపై బ్యాంకు మేనేజరు సాయిసుధ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలు సేకరించి విశ్లేషించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా ఏటీఎం పరిశీలన నిమిత్తం శనివారం రాత్రి నిపుణులు వచ్చారు.

ఏరియా ఆసుపత్రి వద్ద రోగి మృతి



స్వామి అయ్యప్ప మృతదేహం

అనపర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో ఇన్‌పేషెంట్‌గా ఉండి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం తెల్లవారుజామున అదే ఆసుపత్రి భవనం వద్ద మరణించాడు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి సావరంకు చెందిన చెంకాని స్వామి అయ్యప్ప (44) మద్యానికి బానిసై ఇటీవల అనారోగ్యం పాలయ్యాడు. 4 రోజుల క్రితం అతడి తల్లి లక్ష్మి అయ్యప్పను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించింది. శుక్రవారం రాత్రి నుంచి అయ్యప్ప పరాకు మాటలు మాట్లాడుతూ కేకలు వేశాడు. ఇది గమనించి తెల్లవార్లు కంట కనిపెడుతూ వచ్చింది. తెల్లవారుజామున కొడుకు మంచంపై లేకపోవడంతో అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం ఆసుపత్రి ప్రహరీ పక్కన కొడుకు మృతదేహం ఉన్నట్టు సిబ్బంది తెలపడంతో చూసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

అమలాపురం

శబరిమల యాత్రకు మూడు ఆర్టీసీ బస్సులు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శబరిమల యాత్రకు మూడు ఆర్టీసీ బస్సు బయలుదేరి వెళ్లినట్టు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం వాటిని ఆయన ప్రారంభించారు. రావులపాలెం డిపో నుంచి ఇప్పటి వరకు శబరిమల యాత్రకు 13 బస్సులు వెళ్లినట్లు తెలిపారు.

ఘనంగా జడ్పీ బాలుర పాఠశాల 150వసంతాల వేడుక



ప్రవచనాలు చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు, ప్రముఖులను సన్మానిస్తున్న ఆహ్వానకమిటీ సభ్యులు

అమలాపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 150సవంత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆహ్వానకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దశాబ్ద కాలం పైబడి చదువుకున్న వృద్ధులైన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉన్నతస్థితిలో ఉన్న వారిని ఆహ్వానకమిటీ ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేసింది. స్థానిక జిల్లాపరిషత్ బాలురఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో 150వసంతాలు పూర్తి చేసుకున్న కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు హాజరై ప్రవచనాలు చేశారు. మనిషి ఉన్నత విద్యాభ్యాసాలు చేసి ఎంతో స్థాయికి ఎదగడానికి ఈపాఠశాలలే వారి జీవన విధానానికి పునాదిగా మారుతున్నాయన్నారు. ప్రతీ విద్యార్థి ప్రాథమిక విద్య నుంచే తన తలరాతను మార్చుకుని ఉన్నతస్థితికి ఎదుగుతారని, అటువంటి మహోన్నత వ్యక్తులు ఎంతోమందికి అమలాపురంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జీవం పోసిందని పేర్కొన్నారు. తొలుత పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ ప్రముఖులు హాజరయ్యారు.వారిని వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ ఘనంగా సన్మానించింది. ప్రముఖ విద్యావేత్తలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, వివిధ సామాజికవర్గాల నుంచి ఎదిగిన కీలక నేతలను సత్కరించి 150వసంతాల మెమెంటోనుకమిటీ సభ్యులు అందజేశారు. విద్యార్థినులతో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజుతో సహా అనేకమంది ప్రముఖులు, పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఘన స్వాగతం పలికారు. వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

26న కేశనపల్లిలో ఉపముఖ్యమంత్రి పర్యటన


కేశనపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, ఎస్పీ ఎమ్మెల్యే, ఆర్డీవో, అధికారులు

మలికిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో ఈనెల26న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటిస్తారు. శంకరగుప్తం డ్రెయిన్ ముంపుతో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించడానికి రైతులతో ముఖాముఖి చర్చిస్తారు. శనివారం గూడపల్లి పల్లిపాలెంలో హెలిప్యాడ్ నిర్మించడానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో కలెక్టర్ మహేష్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. కొబ్బరిచెట్లు చనిపోయిన పన్నెండు గ్రామాల రైతులతో తుపాను శ్రయ భవనంలో చర్చించడానికి నిర్ణయించినట్టు తెలిసింది. పవన్‌కల్యాణ్ పర్యటనలో సెక్యూరిటీ ఇబ్బందుల దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పోలీసు అధికారులకు సూచించారు. ముందుగా కొన్ని రోడ్లను బ్లాక్ చేస్తే బాగుంటుందని కలెక్టర్, ఎస్పీ దృష్టికి కొందరు తీసుకురాగా అలా చేయడం సరికాదని కలెక్టర్ అన్నారు. అక్కడి నుంచి శంకరగుప్తం డ్రెయిన్ వంతెనపై నుంచి పరిసరాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కవులకు సమాజంలో ఎల్లప్పుడూ మంచి గుర్తింపు


ఎమ్మెల్యే బండారును సత్కరిస్తున్న దృశ్యం

అంబాజీపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో కవులకు ఎప్పుడు మంచి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ది అరిగెల బలరామ్మూర్తి సాహితీ కళాపీఠం తృతీయ వార్షికోత్సవం సంబరాలు శనివారం స్థానిక కొర్లపాటివారిపాలెంలోఉన్న సామాజిక భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడారు. సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కవుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం బలరామ్మూర్తి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖాధికారి డి.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఎ.ఉదయభాస్కర్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, అమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వైస్‌చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిసుబ్బారావు, నాయకులు గుడాల ఫణి, రవణం రాము, సుంకర బాలాజీ, మేడిద శ్రీనివాసరావు, అల్లాడ రవి, సుంకర గణపతిరావు, రంపం సత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల వాడకాన్ని నిషేధించాలి

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు


రైతుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు, అధికారులు

అంతర్వేది, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఎంపడ నక్సా ఆధ్వర్యంలో రసాయనాల వాడకాన్ని నిషేదంపై ఆక్వారైతులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. తొలుత ఎంపీపీ వీరా మల్లిబాబు, మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్, ఎంపడ నక్సా ప్రతినిధులు, రైతులు జ్యోతి ప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం నవంబరు 18నుంచి 24వరకు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వార్షిక ప్రచార కార్యక్రమంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, దాని వ్యాప్తిని అరికట్టేందుకు ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఎంపడ నక్సా పనిచేస్తుందన్నారు. ఈసంవత్సరం యాక్ట్ నౌ ప్రొడక్ట్ అవర్ ప్రజెంట్ సెక్యూర్ అవర్ ఫ్యూచర్ అనే థీమ్‌తో ఈప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఎంపడ నక్సా ప్రతినిధులు తెలిపారు. ఈనేపథ్యంలో ఎంపడ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ తీరప్రాంత రాష్ట్రాల్లో నక్సా ష్రింప్ ఆక్వా రైతుల్లో ఏఎంఆర్ ప్రాధాన్యం, మంచి ఆక్వాకల్చర్ నిర్వహణ పద్ధతుల అమలుపై అవగాహన కల్పించేందుకు 19 భారీ స్థాయి ప్రచారాలు నిర్వహిస్తున్నామన్నారు. మత్స్యశాఖ ఏడీ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రతీ ఆక్వారైతు ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ మంచి ఫలితాలు సాధించాలని, అలాగే ఈ ఎంపడ నక్సా సేవలను ఉపయోగించుకుంటూ ప్రభుత్వం తరపున వచ్చే సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ వీరా మల్లిబాబు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావంతో ఆక్వా రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని, ఆంధ్ర రాష్ట్రం నుంచి ఆక్వా సంపద భారీస్థాయిలో ఎగుమతి అవుతూ రైతులకు గిట్టుబాటు నిర్ణయించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో కొంతమేర ఉపశమనం కలిగినా తుఫాన్, వైరస్ వెంటాడే సమయాల్లో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. క్వాలిటీ సీడ్, విద్యుత్ చార్జీలు, మేత, మెడిసిన్ రేట్లు తగ్గించి రైతులను కాపాడుకోవాలని కోరారు. అనంతరం ఆక్వా రైతు నల్లా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ ఆక్వా రైతు ప్రభుత్వం ఇచ్చే ఇన్సూరెన్సును ఉపయోగించుకునేందుకు ధైర్యంగా ముందుకు వెళ్లాలని, ఇంత వరకు నష్టాలను చూసిన రైతులు కొత్త ఆధునిక పద్ధతులను ఉపయోగించుకోవడంలో సత్ఫలితాలు పొందుతారన్నారు. క్రాప్ హాలీడేలు ప్రకటించడం కన్నా ఆక్వారంగానికి జరుగుతున్న నష్టాన్ని పోరాట రూపంలో రైతులు అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యుడు బీవీ సంపత్, సీఏఏ కన్సల్టెంట్ ఎల్.రాజేష్, నక్సా ఎస్‌సీవో ఎస్.బాలాజీ, ఫీల్డ్ మేనేజర్ పి.సునీల్‌కుమార్, వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


లెమెన్ స్పూన్ పోటీలు

యానాం, నవంబర 22(ఆంధ్రజ్యోతి): యానాంలో ఈనెల24న జరగనున్న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. యానాం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ శాఖాధికారి సూరంపూడి రాజేంద్ర ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ మార్కెట్‌లో మహిళలకు ముగ్గులు, రన్నింగ్, త్రోబాల్, లెమెన్‌స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు.

యానాంలో అథ్లెటిక్స్ పోటీలు

యానాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాం రీజియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో అథ్లెటిక్స్‌లో బాలికలకు పోటీలు నిర్వహించారు. అండర్-14.16 విభాగాల్లో 11ఈవెంట్స్‌లో జరిగిన పోటీల్లో 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీలను యానాం విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీన్ ప్రారంభించారు. పోటీలకు అబ్జర్వర్‌గా విశాఖపట్నంకోచ్ బోరా వెంకటరెడ్డివ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కాపగంటి శేషసుమన్, కార్యదర్శి చింతా వెంకన్న పాల్గొన్నారు.

హరినామ సంకీర్తన

పి.గన్నవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శ్రీవైనతేయ గోదావరి నదీ తీరంలో వేంచేసి ఉన్న శ్రీపట్టాభి రామస్వామి ఆలయం వద్ద గరుడవేగ టీమ్, రామ సేతు భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం హరినామ సంకీర్తన నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మామిడికుదురు మండలం పెదపట్నంలంక తదితర గ్రామాల నుండి వచ్చిన భజన బృందాలు నామజపం వేడుకలు నిర్వహించారు. మూడు గంటలు భజన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని నామ జపం వేడుకల్లో పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ జ్వాలాసాగర్

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని మహిళా శిశుసంక్షేమ శాఖ సీడీపీవో ఎం.నిహారిక అన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖ, అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో మండల పరిషత్ కార్యాలయంలో అలెర్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల కోసం ప్రభుత్వం అనేక ప్రత్యేక చట్టాలను రూపొందించిందన్నారు. అలెర్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో బాల్య వివాహాలపై, బాల కార్మిక నిర్మూలన, బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలాసాగర్ మాట్లాడుతూ పోక్సో చట్టం చైల్డ్‌లైన్ 108, బాల్య వివాహ నిరోధక చట్టం వంటి ప్రధాన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కవి శ్రీనివాసరావుకు సన్మానం

పి.గన్నవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబాజీపేటలో అరిగెల బాలరామ్మూర్తి సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రతా చర్యలు-వచన కవిత సుమహారం కవిత్వ పోటీల్లో మండలంలోని పోతవరానికి చెందిన కొప్పాడి శ్రీనివాసరావు ద్వితీయ స్థానం సాధించారు. శ్రీనివాసరావును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఏపీ రక్షణదళం రాజమహేంద్రవరం కమాండెంట్ కొండా నరసింహరావు, కవులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

క్లస్టర్ సమావేశం

ముమ్మిడివరం,నవంబరు22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీసీసీబీ సెక్రటరీ పి.హనుమంతరావు పేర్కొన్నారు. ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంబంధమైన విషయాలను ఉపాధ్యాయులకు తెలియచేశారు. హెచ్ఎంలు, క్లస్టర్ సీఆర్పీ కేఆర్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముక్తేశ్వరం జడ్పీలో విద్యార్థుల మాక్ పోలింగ్


జడ్పీ పాఠశాలలో జరిగిన మాక్ పోలింగ్‌లో ఓట్లు వేసినట్టు చూపుతున్న విద్యార్థినులు

అయినవిల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ముక్తేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్‌లో విద్యార్థులు ఓట్లు వేసి పాఠశాల విద్యార్థి నాయకున్ని గెలిపించుకున్నారు. విద్యార్థులే నామినేషన్లు స్వీకరణ, ఉపసంహరణ, ప్రచారం, గుర్తుల కేటాయింపు, పోలింగ్ సిబ్బంది నియామకం తదితర విధులు నిర్వహించారు. వారే ఓటింగ్‌లో పాల్గొని నాయకుడిని ఎన్నుకున్నారు.మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. విద్యార్థులు క్యూలైన్‌లో నిలబడి ఓట్లు వేసి ప్రజాస్వామ్య పద్ధతులు, ఓటు ప్రాధాన్యం, విలువలను తెలుసుకున్నారు. కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి హాజరై విద్యార్థుల మాక్ పోలింగ్ నిర్వహించిన తీరును పరిశీలించి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లుగా గుబ్బల సాయిశ్రీనివాస్, నెల్లి మేరీగ్రేస్ వ్యవహరించారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు

అంబాజీపేట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు బిస్కెట్లు, స్వీట్లు, పెన్స్, పెన్సిళ్లు, విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. సేవా సంస్థ సభ్యులు ఎస్.విజయసాయి, పాండురంగ, జగన్నాథం, ప్రభాతి, హరిత్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా నిర్వహించాలి

అంబాజీపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి చేపట్టే సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీడీవో బి.మమత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో అడపా వెంకటకృష్ణ అధ్యక్షతన సామాజిక తనిఖీపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో 1216 పనులకు రూ.9.14కోట్ల వేతనాలకు మెటీరియల్ రూ.3.05కోట్లు ఖర్చుచేశామన్నారు. పనులకు ఖర్చు చేసిన వాటిపై ఈనెల16 తేదీ నుంచి గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం సామాజిక తనిఖీ ఆయా గ్రామాల్లో నిర్వహించి పనుల వివరాలను పరిశీలించి నివేదికను అందిస్తామన్నారు. సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారి సీహెచ్ రవి, డీఆర్పీలు సీమరాజు, ఏడుకొండలు, పద్మావతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ తనిఖీ

అల్లవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఏపీవో రాజామణి తెలిపారు. 2024 ఏప్రిల్1 నుంచి ఈనెల31వరకు జరిగిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీలు చేస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తనిఖీలో పాల్గొనాలన్నారు.

రాజ్యాంగ వజ్రోత్సవాలపై అవగాహన సదస్సు

అమలాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగం 75వ వసంతరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సంస్కారభారతి కోనసీమ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఏఎస్ఎన్ మహిళా కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్కారభారతి అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదించిన తేదీ నుంచి ఈరోజు వరకు జరుగుతున్న అంశాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏవీఎస్ఎం లక్ష్మి, జేకే పద్మిని, ఆకొండి ధన్వంతరి, వలవల వెంకటరెడ్డినాయుడు, శ్రీగిరి గోపాలకృష్ణ పాల్గొన్నారు. అధ్యాపకుడు బి.చంద్రశేఖర్ రాజ్యాంగంలోని పలు విషయాలను విద్యార్థులకు కూలంకుషంగా వివరించారు.

సత్యసాయి శతజయంతి గ్రామోత్సవం

అల్లవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి భగవాన్ శ్రీసత్యసాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా సాయినామ సంకీర్తనలతో కొమరగిరిపట్నంలో శనివారం గ్రామోత్సవం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన సందర్భంగా ఆదివారం కొమరగిరిపట్నం సత్యసాయి సేవా సదన్‌లో సామూహిక సత్యవ్రతాలు, నగర సంకీర్తనలు, భజనలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయని సమితి కన్వీనర్ నడింపల్లి శ్రీనివాసరాజు, సేవాదళ్ కోఆర్డినేటర్ గుర్రం అన్నవరం, పోచినపెద్ది వెంకటేష్, జి.సుబ్బలక్ష్మి తెలిపారు.

కవల దూడల జననం



మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మామిడికుదురుకు చెందిన కుడుపూడి రామేశ్వర్-జానకీ దంపతుల పొలంలో గిరిజాతి ఆవుకు పుట్టిన కవల దూడలు ఆకట్టుకుంటున్నాయి. గిరిజాతి ఆవు మగ, ఆడ దూడలకు జన్మనిచ్చింది. అవి నాలుగు అడుగులు వేస్తూ 2.8అడుగుల ఎత్తు, పొడవుతో ఆకట్టుకుంటున్నాయి. ఇలా కవల దూడలు జన్మించడం అరుదైన సంఘటన అని, ఎక్కడో నూటికి ఒకటి జరుగుతుందని పశువైద్యాధికారి సీహెచ్ శ్రీరామ్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్ డీసీ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఈకామర్స్ డెలివరీ అసోసియేట్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు తెలిపారు. శనివారం ఆయన రాజోలులో విలేకరులతో మాట్లాడుతూఅభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వివరాలకు స్కిల్‌హబ్‌కోఆర్డినేటర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో బోధన చేయాలి

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా కోరారు. మామిడికుదురు హైస్కూలులో క్లస్టర్ సమావేశం శనివారం జరిగింది. వివిధ స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్న సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పాఠం మీద ఆసక్తి కలిగే విధంగా బోధన ఉన్నప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఉత్తమ బోధన చేసి ఎస్ఎస్ఏ 1 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను డీఈవో సత్కరించారు. ఎంఈవో మోకా వెంకన్నబాబు, స్కూలు ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనను జయప్రదం చేయండి

మలికిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల26న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కేశనపల్లి పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం హెలిప్యాడ్, దెబ్బతిన్న కొబ్బరితోటలను, రైతుల సమావేశ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కూటమి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివకోటిలో పల్లెపండుగ కార్యక్రమం సందర్భంగా వీర మహిళలు, తెలుగు మహిళలు, మహిళా మోర్చా నాయకులతో పవన్‌కల్యాణ్ మాట్లాడేలా చూస్తున్నామన్నారు. నాయకులు స్వాగత ఏర్పాట్లను, కార్యక్రమ ఏర్పాట్లను బాధ్యతగా చూడాలన్నారు. శివకోటిలో 10వేల మందితో సభ జరుగుతుందని, సభికులను ఉద్దేశించి పవన్‌కల్యాణ్ మాట్లాడతారని ఆయన అన్నారు. సమావేశంలో దిరిశాల బాలాజీ, మంగెన నాని తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో ఈనెల26న జరిగే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని కేశనపల్లిలో బీజేపీ నియోజకవర్గ కోర్ సమావేశం తీర్మానించింది. కేశనపల్లితో పాటు 12 గ్రామాల్లో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ వల్ల కొబ్బరిచెట్లు తలలువాల్చి చనిపోవడంపై ఉపముఖ్యమంత్రి పర్యటన ఎంతో మేలు చేస్తుందని సమావేశంలో వక్తలు అన్నారు. రైతులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, మేడిచర్ల చాణక్య, చెల్లింగి శ్రీనివాస్, కె.కనకేశ్వరరావు, అడబాల నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మలికిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రాజ్యాంగ రచనకు జరిగిన కృషి అనే అంశంపై వ్యాసరచన, ఆధునిక భారత నిర్మాణంలో రాజ్యాంగ పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఇంగ్లీషు, తెలుగు భాషల్లో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆనందమహానీ, దేవ రాజేంద్రప్రసాద్, ఎన్.రమేష్‌బాబు, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

220 చిత్రాల్లో నటించా

అభిమానుల ఆకట్టుకునే పాత్రలు చేస్తా



మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అభిమానులు ఆకట్టుకునే పాత్రలు చేయడమే తన లక్ష్యమని సినీనటుడు రాజీవ్ కనకాల పేర్కొన్నారు. శనివారం పెదపట్నంలంకు సినిమా చిత్రీకరణ నిమిత్తం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను ఇప్పటి వరకు 225చిత్రాల్లో నటించానన్నారు. విక్రమార్కుడు, స్టూడెంట్ నంబరు1, సూర్యపుత్రులు, సై, జనతా గ్యారేజ్ తదితర చిత్రాల్లో మంచి పేరు తెచ్చాయన్నారు. మంచిపాత్రలు చేసి అభిమానులకు మరింత దగ్గర కావాలన్నదే తన ధ్యేయమన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ

రాజోలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజోలుశాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, మ్యూజికల్ చైర్స్, ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నకోట సుబ్బరాయశర్మ పాల్గొన్నారు.

సొంత జిల్లాలోనే ఉద్యోగులుగా కొనసాగించాలి


ఎమ్మెల్సీ పేరాబత్తులకు వినతిపత్రం అందిస్తున్న సీఆర్పీలు

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సొంత జిల్లాలోనే ఉద్యోగులుగా కొనసాగించాలంటూ జిల్లాలో అధికంగా ఉన్న సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరాన్ని కోరారు. అనంతరం ఆయనకు వారు వినతిపత్రం అందించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బి కాంప్లెక్సులో 29మంది అధికంగా ఉన్నారని, వీరిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు. వేరే జిల్లాలకు వెళితే 150నుంచి 200 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందని, కుటుంబంతో అక్కడికి వెళితే చాలీచాలని జీతం బతకలేమన్నారు. అందువల్ల బదిలీ చేయాలనే ఆదేశాలను నిలుపుదలచేసి సొంత జిల్లాలోను ఎక్కువ పాఠశాలలకు ఉన్న కాంప్లెక్సులకు ట్యాగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిర్రా మణికుమార్, జి.జ్యోతి, కేపీకే చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల26న అమలాపురంలో నిర్వహించే రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చెయ్యాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం గొల్లవిల్లిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన భారత రాజ్యాంగం 77వసంతాల వేడుకలను ఘనంగా జరుపుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సమావేశంలో పండు రాజేష్, డి.అశోక్‌చక్రవర్తి, డి.ఆనందరావు, జె.ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్.కొత్తపల్లిలో సర్పంచ్ కుంచే చిట్టికుమారిచిన్ని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి, నేరేడుమిల్లి సత్తిబాబు, కొంకి బాలకృష్ణ, యాళ్ళ సత్తిబాబు, గోసంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు

అల్లవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, ప్రతీ విద్యార్థి గ్రంథాలయాలను ఉపయోగించుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారిణి వి.ద్వారకామణి అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొనుకు బాపూజీ, ఉపాధ్యాయులు జీఎస్.ప్రకాశరావు, స్వామి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం, పుస్తక పఠనం, క్విజ్ తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 84కిలోల విభాగంలో వాసంశెట్టి మేఘన, 45 కిలోల విభాగంలో కాటంరెడ్డి లక్ష్మీకీర్తన, 54కిలోల విభాగంలో ధర్నాల అనీల్ స్వర్ణాలు సాధించినట్టు హెచ్ఎం నూకల సత్యనారాయణ తెలిపారు. విజేతలను పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, పీడీ కామన మధు, నడింపల్లి పద్మనాభన్ తదితరులు అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థుల ప్రతిభ

ముమ్మిడివరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హెల్దీ లైఫ్ జిమ్ విద్యార్థులు రెండు రజత పతకాలు సాధించారని జిమ్ కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు. ఏఎస్ఎన్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న దొమ్మేటి వేణుమణికంఠ 120కిలోల విభాగంలో రజత పతకం, కాకినాడ పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎ.సత్యనారాయణ 140కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. వీరిని సైదం వంశీ, పాయసం నందు, బీర ఆనంద్‌సాగర్, జాఫర్, జిమ్ సభ్యులు అభినందించారు.

రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇందిర



ఉప్పలగుప్తం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని యనమదల ఇందిర అండర్-17 పవర్ లిఫ్టింగ్ 74కిలోల విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. ఇందిరను హెచ్ఎంతో పాటు పీఎంసీ చైర్మన్ వోలా సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

30న సాంస్కృతిక ఉత్సవాలు

అంతర్వేది, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టేకిశెట్టిపాలెం విజేత పబ్లిక్ స్కూలులో ఈనెల30న సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వీవీమెరకలో జరిగిన సమావేశానికి శ్రీశ్రీకళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళాకారుల ప్రోత్సాహం కొరకు గోదావరి కల్చరల్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఆదివారం నాటకాలు, నాటికలు, ఏకపాత్రలు, ట్రాక్‌సింగింగ్, కూచిపూడి, మ్యూజిక్ తదితర కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు చొప్పల రామారావు, కడలి కృష్ణారావు, అల్లూరి జానకీరామరాజు, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ

అల్లవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశ్రయ జిల్లా దివ్యాంగుల సమాఖ్య, ఎనేబుల్ ఇండియా ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ సహకారంతో గోడిలంకలో దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం జరిగింది. పది రోజులు దివ్యాంగులు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు ఫినాయిల్, నీలిమందు, సర్ఫ్ తయారీ అంశాలపై శిక్షణ ఇచ్చారు. వ్యాపార మెలకువలు నేర్పించారు. శిక్షణ అనంతరం దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందజేశారు. యూనియన్ బ్యాంకు డైరెక్టర్ జయ, అక్షయ జిల్లా దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్, టీడీపీ నాయకుడు వేగిరాజు శ్రీనురాజు, సత్యవేణి, నవీన్‌బాబు, బాబులు, చిట్టిబాబు, ప్రమీల, కొప్పాడి నాగరాజు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా ఎస్‌పీ రాహుల్ మీనా శనివారం ప్రారంభించారు. పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేయగా, వాటిని మండపేట పోలీసుస్టేషన్‌తో అనుసంధానం చేసారు. వీటివల్ల నేరాలు అదుపు చేయడంతోపాటు ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఎస్‌పీ మీనా అన్నారు. సీసీ కేంద్రంతోపాటు స్టేషన్ రినోవేషన్ చేసిన స్టేషన్‌ను ఎస్పీ ప్రారంభించి స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పలు కేసుల్లో పురోగతి కనబర్చిన పలువురు కానిస్టేబుళ్లకు ఎస్‌పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్‌పీ రఘువీర్, మండపేట, అర్బన్, రూరల్ సీఐలు సురేష్, దొరరాజు, ఎస్‌ఐ రాము, పోలీసు సిబ్బంది వున్నారు.


మండపేట పోలీసుస్టేషన్‌లో సీసీ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

కేరళ డీజీపీని కలిసిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవాలయాల పర్యటనలో భాగంగా కొత్తపేటకు చెందిన కేరళ డీజీపీ ఆర్.చంద్రశేఖర్ ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిశారు. డీజీపీ మిత్రుడు బొరుసు వెంకట ఉదయభాస్కర్ స్వగృహానికి ఆయన విచ్చేయగా ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి మొక్కను అందించారు. టెంపుల్ టూరిజంగా ఉన్న తమ ప్రాంతానికి విచ్చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈయన వెంట మాజీ జడ్పీటీసీ ధరణాల రామకృష్ణ, సలాది రామకృష్ణ, శిల్పి రాజకుమార్ వడయార్, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, గనిశెట్టి వీరేష్ తదితరులు ఉన్నారు.


కేరళ డీజీపీ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

పేదల ఇంటికల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం వాడపాలెంలో హౌసింగ్ నిర్మాణాలపై ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన, గ్రామీణ 2.0 పథకం ద్వారా పట్టా గృహాల మంజూరు జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెలసరి ఆదాయం రూ.15వేలలోపు ఉన్నవారు సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవాలనుకునే వారు ఈ నెల 30లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి సంబంధించిన స్థల ధ్రువీకరణను జియో ట్యాగింగ్ ద్వారా చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1,150 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారని, ఈ ప్రక్రియను గృహనిర్మాణశాఖ, మండల అభివృద్ధి అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ పీడీ నరసింహరావు, డీఈ దరణాల శ్రీనివాస్, హౌసింగ్ అధికారులు, నియోజకవర్గ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జనార్దనస్వామి ఆలయంలో భక్తుల సందడి


జనార్దనస్వామి ఆలయంలో సందడి చేసిన విజయవాడ నుంచి వచ్చిన భక్తులు

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో శనివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక భక్తులతో పాటు విజయవాడ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నవజనార్దస్వామి ఆలయాల సందర్శనలో భాగంగా వచ్చినట్టు వారు తెలిపారు. జొన్నాడ, మడికి జనార్దనస్వామివార్లను దర్శించుకున్నామని వారు తెలిపారు. వీరికి ఆలమూరులో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వాగతం పలికారు.

భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

కపిలేశ్వరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగరలో నున్న శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిట లాడింది. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన వైభవ వెంకటేశ్వరస్వామి

ర్యాలి ఆలయంలో ప్రముఖుల పూజలు



ఆలయంలో ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఎస్సీ కమిషన్ రాష్ట్ర సెక్రటరి ఎస్.చిన్న రాముడు కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో రమణమూర్తి వారికి స్వామివారి చిత్రపటాలు అందజేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అన్నప్రసాదానికి విరాళాలు అందజేశారు.


రావులపాడులో మానవహారం నిర్వహించిన డిగ్రీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

రావులపాడులో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాడులో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎన్.అరుణకుమార్ అధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా మదర్‌థెరిసా చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం వలంటీర్లు మానవహారంగా ఏర్పడి మొక్కలు నాటండి పర్యావణాన్ని పరిరక్షించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సర్పంచ్ మట్టా సత్యవతి, సామాజికవేత్త చిన్నం తేజారెడ్డి, హెచ్‌ఎం మదుసూదనరావు, ఎంపీటీసీ డి.కిషోర్, నాయకులు పెచ్చేటి చిన్నారావు, నెక్కంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

220 చిత్రాల్లో నటించా

సినీనటుడు రాజీవ్ కనకాల

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అభిమానులు ఆకట్టుకునే పాత్రలు చేయడమే తన లక్ష్యమని సినీనటుడు రాజీవ్ కనకాల పేర్కొన్నారు. శనివారం పెదపట్నంలంకు సినిమా చిత్రీకరణ నిమిత్తం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను ఇప్పటి వరకు 225చిత్రాల్లో నటించానన్నారు. విక్రమార్కుడు, స్టూడెంట్ నంబరు1, సూర్యపుత్రులు, సై, జనతా గ్యారేజ్ తదితర చిత్రాల్లో మంచి పేరు తెచ్చాయన్నారు. మంచిపాత్రలు చేసి అభిమానులకు మరింత దగ్గర కావాలన్నదే తన ధ్యేయమన్నారు.

అధ్వానస్థితిలో బోడిపాలెం-వాడపాలెం రోడ్డు

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిపాలెం-వాడపాలెం ఆర్ అండ్‌బీ రోడ్డు గోతులతో అధ్వానంగా మారినా అధికార యంత్రాంగం ఉదాశీనత చూపుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ధ్వజమెత్తు తున్నారు. ఈ రోడ్డును ఆధునికీకరించి కేవలం మూడేళ్లే అయినప్పటికి రోడ్డు మధ్యలో చాలాచోట్ల గోతులు ఏర్పడి వాహనదారులకు కనిపించేలోపే ప్రమాదాలబారిన పడుతున్నారు. ముక్తేశ్వరం పంట కాలువకు ఆనుకుని ఉన్న ఈ రోడ్డులో పలువురు వాహనదారులు పడి తీవ్రంగా గాయపడిన ఘటనలున్నాయి. ప్రతిరోజూ ఈ రోడ్డులో ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదని వాహనదారులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే ఇక్కడి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

25న విజయదుర్గా పీఠంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

రాయవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో 25న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. శనివారం పీఠంలో అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ పీఠాధిపతి గాడ్ సమక్షంలో ఉదయం 10 గంటలకు తమిళనాడు తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అర్చకులతో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తజనం పాల్గొని విజయవంతం చేయాలని అడ్మినిస్ట్రేటర్ పేర్కొన్నారు.

కేశవరంలో ఫ్లై ఓవర్ నిర్మించాలి

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేశవరం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు అన్నారు. మండపేట, రామచంద్రపురం, అనపర్తి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు రోజూ వందలాది మంది కేశవరం రైల్వేగేటు దాటి రాజమహేంద్రవరం వెళుతుంటారని అయన అన్నారు. తరచూ రైల్వేగేటు పడిపోవటం వల్ల వాహనదారుల ఇబ్బందుల నేపథ్యంలో సత్వరమే కేశవరం రైల్వే ఫ్లై ఓవర్‌ను నిర్మించాలన్నారు. దీని నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామానికి చెందిన తొలితరం కమ్యూనిస్టు పార్టీ నేత బండారు లక్ష్మణస్వామి మృతి తీరని లోటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శనివారం పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నేతలు పి.వీర్రాజు, గొడవర్తి ఎర్రబ్బు, బండారు రాంబాబు తదితరులు వున్నారు.


అంగరలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగాలి

తహసీల్దార్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా జరపాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ సూచించారు. శనివారం అంగర గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద మాయిశ్చర్ మీటరు పనితీరును, రిజిస్టర్ మెయింటనెన్స్ వంటివి తనిఖీ చేసి వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీఏసీఎస్ సొసైటీలో రైతులకు అవసరార్థం టార్పాలిన్లను అందుబాటులో ఉంచినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.జానకిరామయ్య, వీఆర్‌వో జి.సీతామహాలక్ష్మి, గ్రామ వ్యవసాయకులు ఎల్.సందీప్, జె.పవన్‌తేజ, పీపీసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం దృశ్యం

ముగిసిన ఫార్మసీ వారోత్సవాలు

రావులపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈతకోటలోని లిధియా ఫార్మసీ కళాశాలలో ఈనెల 16 నుంచి శనివారం వరకు నిర్వహించిన 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నేటితో ముగిశాయి. కళాశాల కార్యదర్శి గొల్లపల్లి శ్రీధర్ అధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా స్థానిక రిక్వరీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ గంగిరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మనోహర్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణ పనులు పరిశీలన

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేటలో చేపట్టిన పట్టణ సుందరీకరణ పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం రాత్రి కమిషనర్ రంగారావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లతో కలిసి పరిశీలించారు. మండపేట-ఆలమూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ఐ లవ్ యూ మండపేట వాటర్ పాంట్‌లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట స్థానిక నేతలు, అధికారులు వున్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల యూనిటీ ఫర్ మార్చ్ ర్యాలీ

నేటి యువతకు వల్లభాయ్ పటేల్ ఆదర్శం

మండపేటలో యూనిటీ ఫర్ మార్చ్ ర్యాలీ

మండపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మరవలేనివని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. మండపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకుని కలువపువ్వు సెంటరు నుంచి ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కేపీ రోడ్డు మీదుగా మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు సాగింది. అక్కడ విదార్థులు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేటీటీవి శ్రీనివాసరావు, మై భారత్ జిల్లా అధికారి టీ.గోపి, వలంటీర్ ఈశ్వర్, సరోజిని ప్రోగ్రాం కోఆర్డినేటర్ నేదునూరి రాజేష్, అధ్యాపక సిబ్బంది, లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కెఎస్‌ఆర్‌ఎస్ కిరణ్‌కుమార్, నెహ్రూనాయక్‌తోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం

కపిలేశ్వరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం సర్వారాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఫ్లడ్‌లైట్స్‌తో వాలీబాల్ కోర్టు ప్రారంభమైంది. దీన్ని మండల మాజీ ఎంపీపీ కాద వెంకటరాంబాబు, ఏపీఎన్‌జీవోస్ మండపేట యూనియన్ అధ్యక్షుడు జుత్తుగ మల్లికార్జునుడు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఈటీ వి.రవికుమార్, ప్లేయర్లు సాయి, భీమరాజు, రఘు, రాయుడు నాగేంద్ర కుమార్, బంగారయ్య మాట్లాడుతూ ఫ్లడ్ కోర్టు ఏర్పాటుకు గన్నమని మురళీకృష్ణ రూ.27000, ఇసుక ర్యాంపు నుంచి రూ.13,000, పాస్టర్ ఏసురత్నం రూ.8వేలు, హిందీ మాస్టార్, జె.మల్లిఖార్జునుడు, కె.సురేష్, డాక్టర్ బద్దరావు తదితరులు రూ.20వేలు ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు. వాలీబాల్ కోర్టు ఏర్పాటులో ఐరన్ పోల్స్ ఏర్పాటుకు బాక్సింగ్ సుబ్బు సహకరించారన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ కొప్పిశెట్టి సతీష్, కె.సురేష్, గుత్తుల శివకుమార్, హిందీ పండిట్ రామరాజు, శీలం కోటేశ్వరరావు తదితరులు వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.


వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ రాంబాబు

జాబ్‌మేళాలో 31 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో శనివారం ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 31 మంది ఎంపికయ్యారు. లక్సోస్‌బేబి వరల్డ్‌లో 13 మంది, జస్ట్‌డయల్‌లో, ఎస్‌బీఐ కార్డ్స్‌లో 13, జెప్టో 4 వెరసి మొత్తం 31 మంది ఎంపికైనట్టు ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్‌కుమార్ తెలిపారు. కొంత కాలంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు.


జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు


పేరవరం గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఆత్రేయపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పేరవరం శాఖా గ్రంథాలయంలో ముగింపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వెంకట్రావు గ్రంథా లయాన్ని సందర్శించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని దాతలు అందజేశారు. కార్యక్రమంలో ముళ్లపూడి భాస్కరరావు, గంటి నాగేశ్వరావు, వాకలపూడి కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి శ్రీదేవి నిర్మలను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురిపై బైండోవర్ కేసులు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో బెల్టుషాపులు నిర్వహించిన వారిపై ఎక్సైజ్ అధికారులు బెండోవర్ కేసులు నమోదు చేశారు. రావులపాలెం, గోపాలపురం గ్రామాల్లో గతంలో బెల్టుషాపులు నిర్వహించిన ఐదుగురిపై బెండోవర్ కేసు పెట్టి తహశీల్దార్ ముక్తేశ్వరరావు ఎదుట బెండోవర్ చేసినట్లు కొత్తపేట ఎక్సైజ్ ఎస్‌ఐ కె.అన్నవరం తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శబరిమల యాత్రకు మూడు ఆర్టీసీ బస్సులు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి శబరిమల యాత్రకు మూడు ఆర్టీసీ బస్సు బయలుదేరి వెళ్లినట్టు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం వాటిని ఆయన ప్రారంభించారు. రావులపాలెం డిపో నుంచి ఇప్పటి వరకు శబరిమల యాత్రకు 13 బస్సులు వెళ్లినట్లు తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

ఆలమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ న్యూరో కేర్ ఆసుపత్రి అధ్వర్యంలో న్యూరో కేర్ వైద్య నిపుణుడు ఎస్‌జె.బాలపరమేశ్వరరావు అధ్వర్యంలో కొత్తూరు సెంటర్ లోని ఎస్‌జెఆర్ కల్యాణ మండపంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందని న్యూరో సమస్యలతోపాటు పలు వ్యాధులకు సంబంధించిన వైద్యులతో ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

స్కిల్ హబ్ ద్వారా కంప్యూటర్ శిక్షణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గల స్కిల్ హబ్‌లో కంప్యూటర్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ కల్పన తెలిపారు. ఉచిత కంప్యూటర్ శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, ఐటీఐ, పీజీ అర్హత కలిగిన వారికి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వ్యక్తులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తోపాటు, ఫొటో తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, భారత ప్రభుత్వం పేరిట సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థిని ఎంపిక



కపిలేశ్వరపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం నల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని పిల్లి కల్యాణి మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 26న అమరావతిలోని శాసనసభలో జరిగే మాక్ అసెంబ్లీ సమావేశాలకు విద్యార్థిని హాజరుకానుంది. కోనసీమ జిల్లాలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండపేట నియోజకవర్గం నుంచి తమ పాఠశాల విద్యార్థి కల్యాణి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం చుండ్రు రామలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని గైడ్ టీచర్ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మి, ఎంఈవోలు తాతారావు, విజయకుమార్ అభినందించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పోటెత్తిన మహిళలు

రావులపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి మహిళా ప్రయాణికుల రద్దీ కొనసాగుతూనే ఉంది. శనివారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో రద్దీనెలకొంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మహిళా ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసింది. డిపో మేనేజర్ కుమార్ అధ్వర్యంలో పలువురు సిబ్బంది ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.


విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు

గంగవరంలో కాంప్లెక్స్ సమావేశం

కె.గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాలల సముదాయ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. అన్ని సబ్జెక్టు టీచర్లు ఒకే చోట చేర్చి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులు ఒక్కొక్కరు ఒక్కో మోడల్ లెసన్‌ను బోధించి బోధన నైపుణ్యాన్ని పంచుకున్నారు. రాబోయే పదవ తరగతి పేపర్ ప్యాటర్న్, సబ్జెక్ట్ వైజ్ పేపర్ అనాలసిస్ పై సమష్టి చర్చ జరిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మంటలను ఆర్పుతున్న దృశ్యం

పాతకోటలో తాటాకిల్లు దగ్ధం

కె.గంగవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకోట గ్రామంలో గంగుమళ్ల ధర్మయ్య ఇల్లు శనివారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. రామచంద్రపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు.